క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

నిడదవోలు రూరల్: మండలంలోని కాటకోటేశ్వరం సబ్‌స్టేషన్ పరిధిలోని తిమ్మరాజుపాలెం, లింగంపల్లి గ్రామాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.నారాయణ అప్పారావు గురువారం తెలిపారు. ఆయా గ్రామాల పరిధిలోని గృహ, వాణిజ్య వినియోగదారులంతా సహకరించాలని కోరారు.

30న మహా సౌరయాగం

కొవ్వూరు: ఈనెల 30వ తేదీ నుంచి పట్టణంలో శ్రీనివాసపురం టోల్‌గేట్ జంక్షన్ వద్ద ప్రకృతి రావణ బ్రహ్మ శివాలయ క్షేత్రంలోని బ్రహ్మ సూత్ర మల్లన్న సన్నిధిలో మహా సౌరయాగం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాకుడు అనపర్తి శివరామకృష్ణ తెలిపారు. 30వ తేదీ ఉదయం ప్రారంభమయ్యే ఈ యాగం 14 రోజుల పాటు కొనసాగుతుందన్నారు. వివరాల కోసం 93930 32229, 94911 40816 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నేటి నుంచి ఉచిత కంప్యూటర్ శిక్షణ

కొవ్వూరు: సంక్రాంతి సెలవుల్లో విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ, ఆంగ్లంలో బేసిక్స్ నేర్పించనున్నట్లు డీపీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యాయుడు దున్నా ప్రకాశరావు తెలిపారు. ఈనెల పదో తేదీ నుంచి 18వ తేదీ వరకు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ శిక్షణ శిబిరం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. విద్యార్థులతో పాటు నిరుద్యోగులకు ఈ శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు చేతుల మీదుగా శుక్రవారం ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.

ఎస్టీయూ నూతన కార్యవర్గం ఎన్నిక

తాళ్లపూడి: మండల ఎస్టీయూ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల గౌరవాధ్యక్షుడిగా జి రామచంద్రరావు, అధ్యక్షురాలిగా జేడీ సునీత, ఉపాధ్యక్షుడిగా బి బుచ్చిబాబు, ప్రధాన కార్యదర్శిగా ఈ సత్యనారాయణ, సహాయ కార్యదర్శిగా రవికుమార్, ఆర్థిక కార్యదర్శిగా సీహెచ్ మహేష్, మహిళా కార్యదర్శిగా ఏ కాత్యాయని, కె రేవతి, జిల్లా కౌన్సిలర్‌గా జి రామకృష్ణ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని సంఘ సభ్యులు తెలిపారు.

వృతి నైపుణ్యంపై శిక్షణ

కొవ్వూరు: పురపాలక సంఘ పరిధిలోని వివిధ రకాల వృత్తులు నిర్వహించుకునే వారికి నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా శిక్షణ అందించి జీవనోపాధి కల్పనకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ టి.నాగేంద్రకుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని ఎలక్ట్రిషియన్‌లు, కార్పెంటర్లు, ప్లంబర్‌లు, ఏసీ, గీజర్ మెకానిక్‌లు, టీవీ మెకానిక్‌లు, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మెషీన్‌లు రిపేరు చేసే వారికి నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా ప్రత్యేక శిక్షణ అందించి సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. ఆసక్తి గల వారు జనవరి 10వ తేదీన కొవ్వూరు మెప్మా విభాగం నందు వివరాలు నమోదు చేయించుకోవాలని సూచించారు. వివరాల కోసం 80746 54863, 80746 62954 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

తహసీల్దార్ కార్యాలయం నిర్మించాలి

నిడదవోలు : స్థానిక మున్సిపల్ కార్యాలయం సమీపంలో అసంపూర్తిగా నిలిచిపోయిన తహసీల్దారు కార్యాలయ నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని సీపీఎం నాయకులు కోరారు. సీపీఎం ఆధ్వర్యంలో గురువారం ధర్నా చేపట్టారు. సీపీఎం నాయకులు జువ్వల రాంబాబు మాట్లాడుతూ ఇప్పటి వరకు అద్దె భవనంలో కొనసాగుతున్న తహసీల్దారు కార్యాలయాన్ని ఆర్వోబీ నిర్మాణం కోసం వేరొక ప్రాంతానికి మార్చే పరిస్థితి రావడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. 2012లో అప్పటి మంత్రి పితాని సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావుల ఆధ్వర్యంలో రూ.30 లక్షల సీసీఎల్‌ఏ నిధులతో ప్రారంభించిన నూతన తహసీల్దారు కార్యాలయ నిర్మాణ పనులు ప్రారంభించిన కొద్ది రోజులకే నిలిచి పోయాయన్నారు. కార్యక్రమంలో మురళీ, షాహీ, వస్కా ప్రభాకర్, కె.సురేష్, మోషే షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనానికి కంచాల అందజేత

నిడదవోలు : స్థానిక మోడరన్ రూఫ్ బాలికల జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకానికి రోటరీ క్లబ్ ఆఫ్ మిడ్ టౌన్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో గురువారం నాలుగు భోజన స్టీల్ డ్రమ్స్‌తో పాటు రెండు వందల స్టీలు కంచాలను అందజేశారు. ఫాదర్ డాక్టర్ ఇంజే. పాల్ ఆర్థిక సహకారంతో వీటిని ఏర్పాటు చేశారు. క్లబ్ అధ్యక్షుడు గుబ్బల సత్యప్రసాద్, కౌన్సిలర్ గాలి రాఘవయ్య, సలహా దారులు ఇంజే.శేఖర్, ఆనందం, మురళీకృష్ణ, డి. శివ నగరాజు, షేక్. నాగూర్ మీరా వలి, ప్రిన్సిపల్ బి. గీతాంజలి, విద్యార్థినులు పాల్గొన్నారు.

మావుళ్లమ్మకు సారె సమర్పణ

నిడదవోలు రూరల్: సంక్రాంతి పండగను పురస్కరించుకొని తాళ్లపాలెం గ్రామదేవత మావుళ్లమ్మకు ముత్తయిదువులు గురువారం సారె సమర్పించారు. గ్రామానికి చెందిన మహిళలు అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి సారెను గ్రామ పురవీధుల్లో ఊరేగించి నైవేద్యం పెట్టారు.

గీతాసారం.. విలువల హారం

- శ్లోక పఠనంతో అబ్బుర పరుస్తున్న విద్యార్థులు
- భగవద్గీత పోటీల్లో అద్భుత ప్రదర్శనతో ప్రసంశలు
- శిక్షణకు విధిగా పంపుతున్న తల్లిదండ్రులు
- తీర్చిదిద్దుతున్న శిక్షకురాలు ఘంటా పారిజాత పుష్పవతి

నల్లజర్ల: కర్తవ్య నిర్వహణకు మార్గాన్ని చూపిస్తూ మనిషి ఏం చేయాలో.. ఎలా నడుచుకోవాలో భగవద్గీత బోధిస్తోంది. ఇందులో జీవిత సారాన్ని చెప్పే శ్లోకాలు ప్రతి పుటలోను కోకొల్లలుగా దర్శనమిస్తాయి. దైవభక్తితో పాటు జీవితంలో ఉత్తమ పౌరులుగా ఎదిగేందుకు గీత ఎంతగానో దోహదపడుతుంది. అలాంటి భగవద్గీతలోని క్లిష్టమైన శ్లోకాలతో పాటు ఏ అధ్యాయంలో ఏ శ్లోకాన్ని అడిగినా ఠక్కున చెప్పేవారు నల్లజర్ల గ్రామంలో చాలా మంది ఉన్నారు. ఇక్కడ అనేక మంది మహిళలు భగవద్గీత పారాయణంలో ఆదర్శంగా నిలుస్తున్నారు. తాము భవద్గీతను చదవడం, నేర్చుకోవడంతో పాటు తమ పిల్లల్ని ఇందులో నిష్ణాతులుగా తీర్చిదిద్దుతున్నారు. దాదాపు 40 ఏళ్లుగా గీతా పఠనంలో విశేష అనుభవం గడించిన గురువు ఘంటా పారిజాత పుష్పవతి గీతా శ్లోకాలను పిల్లలకు బోధిస్తూ వారిని అద్భుతంగా తీర్చిదిద్దుతున్నారు. ప్రస్తుతం ఆమె 73వ వసంతంలోకి అడుగుపెట్టారు. ఆమె చదువుకున్నది ఐదో తరగతే అయినా గీతాపఠనంలో ఘనాపాటి అనే చెప్పాలి. విరామ సమయాలలో నల్లజర్లతో పాటు పరిసర గ్రామాలకు వెళ్లి 60 సమాజాల వారికి ఎటువంటి ఫలాపేక్ష లేకుండా ఈ గీతాపఠనం గురించి విశ్లేషించి వారందరినీ గీత చదవడంలో నిష్ణాతులుగా తీర్చిదిద్దడంలో సఫలీకృతులయ్యారు. ఒక్క నల్లజర్లలోనే 20 వరకు భగవద్గీత పారాయణ చేసే సమాజాలున్నాయి. వీరంతా వారానికి రెండు సార్లు స్థానిక వేణుగోపాల స్వామి ఆలయం, రామకృష్ణ భజన మందిరాల్లో గీతా పఠనం చేస్తుంటారు. గ్రామంలో ప్రతి నిత్యం ఏదో ఒక మూల గీతాపారాయణతో పాటు హరినామ సంకీర్తనలు వినిపిస్తూనే ఉంటాయి.


నల్లజర్ల వేణుగోపాల స్వామి ఆలయంలో విద్యార్థులకు భగవద్గీత పాఠాలు బోధిస్తున్న ఘంటా పారిజాత పుష్పవతి


గురువు పుష్పవతిని సత్కరిస్తున్న శిష్యులు

గురువాజ్ఞతోనే బోధన



దాదాపు 40 ఏళ్ల క్రితం వేణు గోపాలస్వామి ఆలయానికి వచ్చిన సత్యానంద స్వామి మాకు భగవద్గీత బోధనలో తర్ఫీదునిచ్చారు. నాటి నుంచి నేటి వరకు గ్రామంలో అనేక మందికి ఇది దిక్సూచిగా మారింది. గీతా శ్లోకాలను ఎవరు నేర్పమని అడిగినా ఎటువంటి ఫలాపేక్ష లేకుండా నేర్పమని గురువు సత్యానంద స్వామి ఆదేశించడంతో ఆసక్తి గలవారికి గీత చదవడంలో తర్ఫీదునిస్తున్నాను. కోవిడ్ సమయంలోనూ విద్యార్థులకు నిబంధలను అనుసరించి శిక్షణ అందించాను. అభ్యసనంతో గీతా శ్లోకాలపై పట్టు సాధించిన విద్యార్థులు వివిధ పోటీలలో పాల్గొని బహుమతులు గెలుచుకున్నారు.

ఘంటా పారిజాత పుష్పవతి, గీతా బోధకురాలు, నల్లజర్ల

సామాజిక అంశాలపై అవగాహన



దేవాలయాలలో భగవద్గీత పారాయణం చేసే అవకాశం వచ్చింది. చిన్నపట్నుంచి శ్లోక పఠనంతో పాటు భావం తెలుసుకోవడం ద్వారా సామాజిక అంశాలపై అవగాహన ఏర్పడింది. దీంతో జీవనం సజావుగా సాగుతోంది. 30 ఏళ్లగా గీత చదువుతున్నాను. మనుమలకు నేర్పిస్తున్నాను.

మార్ని సుబ్బులక్ష్మి, నల్లజర్ల.

పఠనంతో ఉత్తమ వ్యక్తిత్వం



భగవద్గీత విలువలకు పట్టం కట్టిన మహాగ్రంథం. జీవిత సారాన్ని చేప్పే శ్లోకాలు ప్రతి పుటలోనూ ఉన్నాయి. గీతాపఠనం చిన్నారులకు నేర్పించడం వల్ల వారు సరైన దిశానిర్దేశంతో ముందుకు సాగుతారు. హింసాత్మక ప్రవృత్తికి దూరంగా ఉండటంతో పాటు చెడు మార్గంలో పయనించే అవకాశమే ఉండదు. ఏకాగ్రత అలవడుతుంది.

దాపర్తి లక్ష్మీకుమారి, నల్లజర్ల.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

దేవరపల్లి: స్థానిక 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో కొత్త టౌన్ ఫీడర్ ఏర్పాటు పనులు, లైన్ల నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం పలు ఫీడర్లకు విద్యుత్ సరఫరా నిలుపు చేస్తున్నారు. ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎస్.నారాయణ అప్పారావు గురువారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. ఆ వివరాలివీ..

- సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ టౌన్ ఫీడర్, మార్కెట్, ఇండస్ట్రియల్, బందపురం, గొల్లగూడెం, అచ్చయపాలెం ఫీడర్లలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు. ఉదయం 6 నుంచి 9 గంటల వరకూ త్రీఫేజ్ వ్యవసాయ విద్యుత్ సరఫరా ఉంటుంది. తరువాత మధ్యాహ్నం ఒంటి గంట నుంచి ఇస్తారు.
- పల్లంట్ల సబ్ స్టేషన్ పరిధి చిక్కాల ఫీడర్‌లో చెట్ల కొమ్మల తొలగింపు నిమిత్తం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ సరఫరా నిలిపివేస్తారు. పల్లంట్ల టౌన్, రూరల్, లక్ష్మీపురం ఫీడర్లకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ సరఫరాకు అంతరాయం కలుగుతుంది. వ్యవసాయానికి ఉదయం 6 నుంచి 9 గంటల వరకూ త్రీఫేజ్ సరఫరా ఇస్తారు. తిరిగి మధ్యాహ్నం 12 గంటల నుంచి ఇస్తారు.
- కృష్ణంపాలెం సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ యర్నగూడెం, కృష్ణంపాలెం, వ్యవసాయ వినియోగదారులకు విద్యుత్ సరఫరా నిలుపు చేస్తారు. వీరికి ఉదయం 4 నుంచి 8 గంటల వరకూ, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 6 గంటల వరకూ సరఫరా చేస్తారు.

ముక్కోటి ఏకాదశికి ఏర్పాట్లు పూర్తి


వేంకటేశ్వరస్వామి ఆలయంలో వంటశాలను పరిశీలిస్తున్న దేవదాయ శాఖ జిల్లా అధికారి నాగేశ్వరరావు

కొవ్వూరు: వైకుంఠ ముక్కోటి ఏకాదశి సందర్భంగా పట్టణంలో వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో ఉత్తర ద్వారా దర్శనానికి ఏర్పాట్లును సిద్ధం చేశారు. గోష్పాదక్షేత్రంలోని సుందర గోవిందుడి ఆలయంలో ప్రత్యేక బారీకేట్లు ఏర్పాటు చేశారు. తెల్లవారు జామున నాలుగు గంటల నుంచి స్వామి దర్శనానికి ఏవిధమైన ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేశామన్నారు. సాయంత్రం ఐదు గంటలకు ఆలయం వద్ద వెంకటేశ్వరస్వామి వత్రం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలి పారు. భక్తులంతా సంప్రదాయ దుస్తుల్లో రావాలని, ఇంట్లో ఉండే బాలబాలికలను తీసుకుని వత్రాలకు హాజరు కావాలని కోరారు.

పెరవలి: వైకుంఠ ఏకాదశి సందర్భంగా వేంకటేశ్వర స్వామి ఆలయంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని దేవదాయ ధర్మాదాయ శాఖ జిల్లా అధికారి కె నాగేశ్వరావు తెలిపారు. పెరవలి మండలం అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని గురువారంధాయన పరిశీలించారు. జిల్లాలో వైష్ణవాలయాలకు వైకుంఠ ఏకాదశి పర్వదినాన భక్తులు అధిక సంఖ్యలో వస్తారని భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశామని తెలిపారు. అన్నవరప్పాడు వేంకటేశ్వర స్వామి ఆలయం భక్తుల కొంగుబంగారంగా నిలుస్తోందని అన్నారు. పర్వదినం సందర్భంగా చేసిన ఏర్పాట్లు బాగున్నాయని కితాబిచ్చారు. కార్యక్రమంలో తనిఖీ దారుడు జి సత్యప్రసాద్, ఆలయ ఈఓ మీసాల రాధా కృష్ణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగుల కేంద్రంలో తనిఖీలు

నిడదవోలు: శంఖరాపురం ఉచిత మానసిక దివ్యాంగుల ప్రత్యేక పాఠశాల, పునరావాస కేంద్రాల(హృదయాలయం)లో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాల మేరకు గురువారం డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి (డీసీపీవో) సి.రాజ్‌కుమార్ బృందం ఆధ్వర్యంలో అధికారులు తనిఖీలు చేపట్టారు. హృదయాలయంలో రికార్డులు పరిశీలించారు. ఆశ్రయం పొందుతున్న దివ్యాంగుల పట్ల తీసుకుంటున్న జాగ్రత్తలపై హృదయాలయం కో ఫౌండర్ బలగం విశాలాక్షిని అడిగి తెలుసుకున్నారు.

వైకుంఠ ఏకాదశికి శ్రీవారి ఆలయం ముస్తాబు


దేవరపల్లిలో వైకుంఠ ఏకాదశికి ముస్తాబైన శ్రీవారి ఆలయం


దేవరపల్లిలో వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారు

దేవరపల్లి: వైకుంఠ ఏకాదశికి స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం ఉదయం 5 గంటల నుంచి స్వామి వారిని ఉత్తర ద్వారం ద్వారా దర్శనం చేసుకోవాలని భక్తులకు తెలిపారు. ఈ మేరకు ఆలయంలో స్వామివారి దర్శనానికి భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. రాత్రి 7 గంటలకు ఉభయ దేవరులతో కూడి స్వామివారి తిరుచ్చి ఉత్సవం జరుగుతుందన్నారు. 11వ తేదీ ఉదయం 6.30 గంటలకు స్వామి వారికి కూడార్లై సేవ ఉత్సవం, సాయంత్రం 6.30 గంటలకు స్వామి వారి ఊంజల్ సేవ, 13న సాయంత్రం 7 గంటల నుంచి గోదా రంగనాథుల కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ అంబటి శ్రీనివాసరావు తెలిపారు. అలాగే యర్నగూడెంలో ఉన్న అలివేలు మంగా పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉదయం 5 గంటల నుంచి ఉత్తర ద్వార దర్శనం కల్పించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు

దేవరపల్లి: సంక్రాంతి సందర్భంగా కోడి పందేలు నిర్వహించినా, బరులు ఏర్పాటు చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ కె.రాజ్యలక్ష్మి హెచ్చరించారు. గురువారం పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, పోలీస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో కోడి పందేల నిర్వహణకు బరులు తయారు చేస్తున్న వారి వివరాలు సేకరించి, చర్యలు తీసుకోవాలని సూచించారు. బరుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. కోడి పందేల నిర్వహణకు బరులు ఏర్పాటుకు స్థలం ఇచ్చిన యజమానులపై చర్యలు ఉంటాయని తెలిపారు. కాగా.. దేవరపల్లిలో పాత బరుల వద్ద గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎస్.రవికిషోర్ ఆధ్వర్యంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.

స్టడీ మెటీరియల్ అందజేత

నిడదవోలు : పదో తరగతి పరీక్షా ఫలితాల్లో పట్టణంలోని ప్రతి పాఠశాల వంద శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా పని చేయాలని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. రాజమహేంద్రవరం జిల్లా పరిషత్ యాజమాన్యం రూపొందించిన విజయకేతనం స్టడీ మెటీరియల్‌ను స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం ఆయన విద్యార్థులకు పంపిణీ చేశారు.

తాళ్లపూడి: విద్యార్థులు ఇప్పటి నుంచి ప్రణాళికా బద్ధంగా చదవడం ద్వారా మంచి మార్కులు సాధించవచ్చునని ఎంఈవో బాలామణి తెలిపారు. మండలంలోని వేగేశ్వరపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఉచిత స్టడీ మెటీరియల్‌ను గురువారం అందజేశారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

నిడదవోలు రూరల్: విద్యార్థులంతా పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు ఆకాంక్షించారు. సమిశ్రగూడెం, శెట్టిపేట జెడ్పీ ఉన్నత పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు జిల్లా పరిషత్ ద్వారా అందిస్తున్న విజయ కేతనం స్టడీ మెటిరియల్ పుస్తకాలను గురువారం సూరిబాబు అందజేశారు.

పెరవలి: విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలనే ఉద్దేశ్యంతో తయారు చేసిన స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కార్నెర్ల ప్రసాద్ కోరారు. పెరవలి మండలంలోని 7 ఉన్నత పాఠశాలల్లో 500 మంది విద్యార్థులకు గురువారం స్టడీ మెటీరియల్ అందించారు. పలు పార్టీల నాయకులు, గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకంపై సామాజిక తనిఖీ

నల్లజర్ల: అనంతపల్లి జెడ్పీ హైస్కూల్‌తో పాటు పలు పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలుపై డీఆర్పీలు బుధ, గురువారాల్లో సామాజిక తనిఖీ చేశారు. దీంతో పాటు కోడిగుడ్లు, చిక్కీలు, రాగిజావ తదితర వాటి నాణ్యతను పరిశీలించారు. మరుగుదొడ్ల శుభ్రతను చూశారు. ఆర్వో ప్లాంటుకు మరమ్మతులు చేయించాలని సూచించారు. తొలిరోజు రికార్డులు, రెండో రోజు తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి పలు అంశాలు వివరించారు. కార్యక్రమంలో డీఆర్పీలు రేవు నాగేశ్వరరావు, కొమ్మెర సూర్యప్రకాశరావు, హెచ్ఎం హేమంత్ కుమార్, విద్యా కమిటీ చైర్మన్ కనుమూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ర్యాంప్ మాకొద్దు

జేసీకి తేల్చి చెప్పిన రైతులు

పెరవలి: ఇసుక ర్యాంప్ ఏర్పాటు చేస్తే గ్రామస్తులకు ఉపాధి లభించటంతో పాటు ఇసుక కొరత లేకుండా ఉంటుందని జేసీ సీహెచ్ చిన్న రాముడు అన్నారు. పెరవలి మండలం ముక్కామల పరిధిలోని ముత్యాలవారిపాలెం వద్ద ఇసుక ర్యాంప్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. రైతులతో మాట్లాడుతూ ఇక్కడ ఇసుక నిల్వలు పూర్తి స్థాయిలో ఉన్నాయని ఇసుక తీస్తే మీకు ఇబ్బంది ఏమిటని రైతులను ప్రశ్నించారు. ర్యాంప్ ఏర్పాటు చేస్తే గోదావరికి వరద వస్తే లంక భూములకు చేటు కలుగుతుందని, దీని వలన భూములకు రక్షణ లేకుండా పోతుందని నిలుపుదల చేయాలని రైతులు కోరారు. ఇప్పటికే లంక కోతకు గురై వందలాది ఎకరాలు నదీగర్భంలో కలసి పోయిందని ఉన్న లంకను కాపాడుకోకపోతే భవిషత్ ఉండదని, ఇసుక ర్యాంప్ ఏర్పాటు చేయవద్దని కోరారు. కార్యక్రమంలో మైనింగ్ అధికారులు, రెవెన్యూ, పంచాయితీ రాజ్ ఉద్యోగులు, రైతులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలి

నిడదవోలు : బాల్య వివాహల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీసీపీవో రాజ్‌కుమార్ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం కిశోర వికాసం కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాలు, బాలల హక్కులు, ఫోక్సో చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ టి కృష్ణవేణి మాట్లాడుతూ బాల్య వివాహాలు జరిగిన అమ్మాయిల పరిస్థితి అత్యంత దుర్భరంగా ఉంటోందన్నారు. ఎంఈవో గురునాథం మాట్లాడుతూ బాలికా విద్య గురించి తెలియజేశారు. పెరవలి ఐసీడీఎస్ పీవో శ్రీలక్ష్మి, అండన్‌వాడీ అర్బన్ సూపర్‌వైజర్లు లక్ష్మి, నలిని, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, ఆర్పీలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు సాయం

దేవరపల్లి: మండలంలోని ధుమంతునిగూడెం శివారు సుబ్బరాయపురంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయి నిరాశ్రయులైన మూడు కుటుంబాలకు జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డి.సువర్ణరాజు ఆధ్వర్యాన గురువారం ఆర్థికసాయం అందజేశారు. ఒక్కో కుటుంబానికి రూ.15 వేల నగదు, 25 కిలోల బియ్యం, నిత్యావసర సరకులు అందజేశారు.

సంక్రాంతి వచ్చింది.. సరదాలు తెచ్చింది


తాళ్లపూడిలో సంక్రాంతి సంబరాల్లో ఆకట్టుకున్న రంగవల్లులు


సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న రేడియంట్ విద్యార్థులు


కొవ్వూరులో భోగి మంటల వద్ద కోలాట నృత్యాలు

- పాఠశాల్లో వేడుకగా సంక్రాంతి సంబరాలు
- ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు
- ఆకట్టుకున్న రంగవల్లులు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

తాళ్లపూడి: మండలంలోని పలు విద్యా సంస్థల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలను గురువారం కోలాహలంగా నిర్వహించారు. వేగేశ్వరపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వేడుకలు అంబరాన్ని తాకాయి. ఎంఈవో సీహెచ్ బాలామణి కార్యక్రమంలో పాల్గొన్నారు. తాళ్లపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలతో పాటు పలు పాఠశాలల్లో కార్యక్రమాలు నిర్వహించారు. తాళ్లపూడి మాంటిస్సోరీ హైస్కూల్లో సంక్రాంతి సంబరాలు, విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. కరస్పాండెంట్ వీవీ అనీష్ మాట్లాడుతూ తెలుగు సంస్కృతీ, సంప్రదాయాలను నేటి తరం విద్యార్థులకు తెలియ చేయాలనే ఉద్దేశ్యంతో ఏటా సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. స్థానిక రేడియంట్ స్కూల్లో సంక్రాంతి సంబరాలు, ముగ్గుల పోటీలను నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో అలరించారు. పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: సంస్కృతీ సంప్రదాయాలు, జీవన విధానం గురించి నేటితరం విద్యార్థులకు కళ్లకు కట్టినట్లు చూపిస్తూ మండలంలో వేలివెన్ను అన్నపూర్ణ విద్యాసంస్థలో గురువారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో తెలుగుతనం ఉట్టిపడేలా అలరించారు. వివిధ వేషధారణలతో అలనాటి జీవన విధానాన్ని కళ్లకు కట్టినట్లు చూపించారు. పిండి వంటలు చేయడం, వరి పండించడం, కలుపు తీయడం, ధాన్యాన్ని బళ్లపై తోలడం, హరిదాసు, భోగి పళ్లు పోయడం వంటివి గ్రామస్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విద్యాసంస్థల చైర్మన్ నందిగం భాస్కరరామయ్య, కరస్పాండెంట్ నందిగం వెంకట సీతారామయ్య పాల్గొన్నారు.

కొవ్వూరు: సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశించడాన్నే మకర సంక్రాంతిగా పిలుస్తారని ఏబీఎన్ అండ్ పీఆర్ఆర్ కళాశాల ఫౌండర్, ప్రిన్సిపాల్ ఎన్‌వీ సుబ్బారావు పేర్కొన్నారు. కళాశాలలో గురువారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. యాజమాన్యం తరుపున తులసీ నిఖిలేష్ జ్యోతి ప్రజ్వలన చేసి సంబరాలు ప్రారంభించారు. సంక్రాంతి ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేయాలన్న సంకల్పంతోనే కళాశాలలో సంక్రాంతి సంబరాలు ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు, ఇతర సిబ్బంది సంప్రదాయ దుస్తులతో హాజరయ్యారు. కళాశాల ప్రాంగణంలోనే భోగి మంటలు వేశారు. విద్యార్థులు భోగి మంట వద్ద సంక్రాంతి పాటలు పాడుతూ కోలాట నృత్యాలు చేశారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ వై రమేష్, కళాశాల కల్చరల్ కోఆర్డినేటర్ రాణి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: మండలంలోని మోర్త ఉన్నత పాఠశాలలో హెచ్ఎం కె.శ్రీనివాసు ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు గురువారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థినులు రంగవల్లులు వేయగా, ఉపాధ్యాయుల సమక్షంలో విద్యార్థులు భోగి మంటలను వేశారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.


మాంటిస్సోరీ హైస్కూల్లో సంక్రాంతి సంబరాలు


వేలివెన్ను అన్నపూర్ణ విద్యానికేతన్‌లో...


కొవ్వూరు ఏబీఎన్ అండ్ పీఆర్ఆర్ కళాశాలలో...